# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. నంద్యాల జిల్లాలోని శ్రీశైల ఆలయం, ఆలయ పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**2. సమగ్ర కుటుంబ సర్వేపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లు, అధికారులకు సూచించారు.**

**3. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు మానవతా ధృక్పథంతో వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సూచించారు.**

**4. తెలంగాణలో రాబోయే నెల రోజులు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.**

**5. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభమవుతాయి. సమావేశాల మొదటిరోజే పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.**

==========================

నంద్యాల జిల్లాలోని శ్రీశైల ఆలయం, ఆలయ పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శ్రీశైలంలో భ్రమరాంబ, మల్లికార్జునస్వామిని దర్శించుకున్న అనంతరం నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. నల్లమల అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, బీసీ జనార్దనరెడ్డితో కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అటవీ, దేవదాయ శాఖ, జిల్లా కలెక్టర్ చర్చించి బృహత్ ప్రణాళిక రూపొందిస్తారని వెల్లడించారు. నివేదిక ప్రకారం తిరుమల తరహాలో శ్రీశైలం అలయాన్ని అభివృద్ధి చేస్తామని చంద్రబాబునాయుడు వివరిస్తూ...

...వాయిస్...36 సెకన్లు

--------------------------

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దేశంలోనే అతిపెద్ద కార్యక్రమమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు కుటుంబ సర్వేపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కుటుంబ సర్వేపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు సంబంధిత అధికారులతో దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రులు, శాసనసభ్యులు సర్వేలో పాల్గొనాలని కోరారు. అధికారులు, సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ విజయవంతంగా పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సూచించారు. ఇటీవల కాకినాడ జిల్లా తుని సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు విద్యార్థుల కుటుంబ సభ్యులు గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. వారికి పవన్ కల్యాణ్ ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ట్రస్ట్ తరపున 2 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించారు. పోలీసులు మానవతా దృక్పథంతో స్పందించాలని పవన్ కళ్యాణ్ సూచిస్తూ...

...వాయిస్...27 సెకన్లు

---------------------------

తెలంగాణలో రాబోయే నెల రోజులు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై సచివాలయంలో నిన్న ఆయన మార్కెటింగ్, సహకార శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతిరోజూ జిల్లాస్థాయి నుంచి మండల స్థాయి వరకు పనిచేస్తున్న మార్కెటింగ్, డీసీఎంఎస్, సహకార శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తూ కొనుగోళ్లకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆదేశాలివ్వాలని సూచించారు. సహకార సంఘాలు, డీసీఎంఎస్, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభమవుతాయి. సమావేశాల మొదటిరోజే పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శాసనసభ ప్రాంగణంలోని ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర మంత్రివర్గం రేపు ఉదయం 9 గంటలకు సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. అనంతరం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో ఆర్థికమంత్రి నిన్న విజయవాడ రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. బడ్జెట్ ప్రాధమ్యాలను ఆయనకు వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భారీగా నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. వివిధ సామాజిక వర్గాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌లకు ఛైర్మన్‌లను నియమించింది. వీటితో పాటు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్, సాంస్కృతిక మిషన్, ఫైబర్‌నెట్, అటవీ అభివృద్ధి, గ్రంథాలయ పరిషత్ సహా వివిధ పట్టణాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు ఛైర్మన్‌లను నియమించింది. మొత్తం 59మందిని నామినేటెడ్ పదవుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును రాష్ట్ర నైతిక విలువల సలహాదారుగా నియమించడంతోపాటు.. ఆయనకు క్యాబినెట్ ర్యాంకును కల్పించారు.

---------------------------

2025 సంవత్సరానికి సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. 2025లో మొత్తంగా 27 సాధారణ సెలవులు, 23 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు 174 మందిని విద్యాశాఖ ఎంపిక చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో రేపు జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో వారికి ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖ నుంచి 77 మందికి, ఇంటర్మీడియట్ విద్యా శాఖలో 26 మందికి, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు 16 మందికి, డిగ్రీ అధ్యాపకులు 19 మందికి, ఇంజనీరింగ్, ఫార్మసీ అధ్యాపకులు నలుగురికి, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు 32 మందికి పురస్కారాలు అందజేయనున్నారు.

---------------------------

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా విజయోత్సవాల నిర్వహణ విధివిధానాలు రూపొందించేందుకు హైదరాబాద్‌లో నిన్న ఆయన అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం సమావేశమైంది. ఉత్సవాల నిర్వహణపై పలు నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ 25 రోజుల పాటు వివిధ కీలక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపైనా ప్రజలకు ఈ కార్యక్రమాల ద్వారా వివరించనున్నారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో రాబోయే 36 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే 2 రోజుల్లో పశ్చిమ దిశగా తమిళనాడు, శ్రీలంక తీరాల మీదుగా ఈ ఆవర్తనం కొనసాతుందని పేర్కొంది. ఈ ప్రభావంతో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, దక్షిణకోస్తా జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో తేలిక పాటి జల్లులు కురిసే సూచనలున్నాయని వెల్లడించింది. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

---------------------------

రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులను చక్కదిద్ది.. ఎన్నికల హామీ మేరకు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం తప్పకుండా ఇస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో 61 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు నిన్న ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో చేసిన రుణాలను తీర్చుకుంటూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో కొంత జాప్యం జరుగుతోందని.. ఇచ్చిన హామీ తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. ఇప్పటివరకు 18 వేల కోట్ల రూపాయల పంట రుణాలను మాఫీ చేశామని.. డిసెంబరు నెలాఖరుకు మరో 13వేల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తామని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

======================